


# ప్రేమ వివాహాలు

నవీన్

"యేవండీ! ఈ వార్త విన్నారా?" అంటూ ఉదయం యేడింటికే వచ్చాడు మా పక్కింట్లో వుండే రిటైర్డ్ హెడ్‌గు మాస్తా రమణయ్యగారు.

"ఏ వార్త?" అన్నాను న్యూస్ పేపర్ చదువుకుంటున్న నేను.

"ఈ వీధి చివరవుండే ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ యోగానందంగారు లేరు? ఆయన మీకు తెలుసుకదా?" అన్నాడు రమణయ్య.

"ఆయన తెలియకపోవటమేమిటి? బాగా తెలుసు. ఆయన కేమయింది?" అన్నాను.

"ఆయన కూతురుందే..........ఆ అమ్మాయి పేరు శ్రావ్య - శ్రావ్య ఆయన కొంప ముంచేసింది"

"ఇగ్జిక్యుటివ్ ఇంజనీర్‌గారిది మూడంతస్తులమేడ. అంత పెద్దకొంపను ముంచేటంతశక్తి ఆ చిన్నమ్మాయికుందంటే నేను నమ్మలేను" అన్నాను.

"నమ్మకపోవటమేమిటండి బాబూ! ఆ అమ్మాయి చూడటానికెంతో అమాయకంగా కనబడ్తుందా? కానీ యేం చేసిందనుకున్నారు - ఓ తురకాడిని ప్రేమించి వాడితో లేచిపోయిందట! ఇది కొంపముంచటం కాకపోతే ఇంకేమవుతుందో చెప్పండి"

ఆయన చెప్పిన విషయాన్ని గూర్చి కొన్ని క్షణాలు ఆలోచిస్తూ వుండిపోయాను.

"ప్రేమించటంకొంపముంచటం కింద కొస్తుందా? మీరు మరీ దారుణంగా మాట్లాడుతున్నారు. ప్రేమించటాన్ని గూర్చి ఎంతో మంది కవులు ఎంతో అద్భుతమైన కవిత్వం రాశారు. ఎంతోమంది నవలాకారులు గుండెల్ని ద్రవింపజేసే ఎన్నో నవలల్ని రాశారు. యే సినిమా చూసినా హీరో హీరోయిన్లు ప్రేమించుకోవటం..... వాళ్ళ ప్రేమకు సమాజం ఎన్నో అడ్డంకుల్ని సృష్టించటమే ప్రధానమైన ఇతివృత్తంగా వుంటుంది. ఇలా ప్రేమమీద వచ్చినంత కవిత్వం, ప్రేమమీద వచ్చినన్ని నవలలు, ప్రేమమీద వచ్చినన్ని సినిమాలు మరే ఇతర విషయం మీద రాలేదు. ప్రేమమీద రచించబడిన కవిత్వాన్ని చదువుతూ మనమంతా పరవశించి పోతాం....... సినిమాల్లో హీరో హీరోయిన్ల ప్రేమదృశ్యాల్ని చూసి మనం కూడా ప్రేమించకోవటం లోని ఆ మహత్తరమైన ఆనందాన్ని పొందుతాము. వాళ్ళ ప్రేమ విఫలమైతే - దేవదాసులోలా - మనం భోరున యేడ్చేస్తాం. అదే వాస్తవ జీవితంలో ఎవరన్నా ప్రేమించుకున్నారని తెలిసినప్పుడు దాన్ని ఎవరిదో కొంపముంచిన ఒక అవాంఛనీయ పరిణామంగా చిత్రిస్తారెందుకు? కళలో హర్షించబడిన ఈ ప్రేమ వాస్తవ జీవితంలో ఇంతటి నిరసనకు ఎందుకు గురవుతుందో నాకర్థంకాదు"

"మీరలాగే మాట్లాడ తారులెండి. మీరూ కవులేకదా"

"నేను కవినికాదండి బాబు - నేను కేవలం కథలు, నవలలు మాత్రమే రాస్తాను."

"యేదైనా ఒకటేలేవయ్యా! రాసేవాళ్ళందర్నీ మేము కవులనే అంటాం. ఇంతకూ నన్నా విషయాన్ని పూర్తిగా చెప్పనీయలేదు మీరు"

"చెప్పండి"


"తన కూతురు ఓ తురకాడితో లేచిపోయిందని తెలియగానే ఇంజనీర్‌గార్కి గుండె పోటొచ్చేసింది. హాస్పిటల్లో జాయిన్ చేశారు. ఆ అమ్మాయి తల్లేమో ఉరేసుకొని చనిపోవటానికి ప్రయత్నించిందట. వాళ్ళ పెద్దబ్బాయి వెంటనే తలుపులుబద్దలు కొట్టేసి ఆమె ప్రాణాలు కాపాడాడట!"

"మైగాడ్! ఇంత బీభత్సం జరిగిందా?"

"ఆ అమ్మాయి ప్రేమిస్తే ప్రేమించింది. కనీసం మన మతస్తుణ్ని చూసి ప్రేమించినా ఆ తల్లిదండ్రులింత బాధపడేవాళ్ళుకారు. మరీ ఓ తురకాడిని ప్రేమించటం....... వాడితో లేచిపోవటం.. ..... తర్వాతేం జరిగిందనుకున్నారు. వాళ్ళిద్దరూ పెళ్ళిచేసుకున్నారట....."

"మంచిదేకదా! ప్రేమించుకున్నారు. పెళ్ళికూడా చేసుకున్నారు. యేమతమైతే యేమిటి? అన్ని మతాల సారమూ ఒకటేనని మీరే చెప్పారుకదా!"

"చెప్పటం వరకు బాగానే వుంటుందండి. చేసి చూపిస్తే ఎలా భరిస్తాం. ఈ ప్రేమ గీమా అంతా బరి తెగించిన వ్యవహారం. ఈ పాడు సినిమాలు చూసి పాడు నవలలు చదివి యువతరం పూర్తిగా చెడిపోతోంది. వాడిలో యేముందని ప్రేమించింది? నాలుగురాళ్ళు పంపాదించే తెలివిలేదు. చూడటానికి అందంగా వుంటాడట. వాడు కనీసం గ్రాడ్యుయేషన్ కూడా పూర్తిచెయ్యలేదట. ఇద్దరు కలిసి ఎప్పుడూ టెన్నిస్, షటిల్ మొదలైన ఆటలు ఆడుకుంటూ వుండేవాళ్ళట.... అంతే! ప్రేమించేసుకున్నారు. ప్రేమించుకోగానే సరిపోయిందా? దీనికి సంపాదించే శక్తిలేదు



- వాడికి సంపాదించే శక్తిలేదు. రేపెలా బ్రతుకుతారు? ఇంతకాలం ఎంతో గారా బంగా పెరిగిన పిల్ల తండ్రి సంపాదించి తెస్తోంటే హాయిగా కార్లలో తిరుగుతూ, ఏ.సి. రూముల్లో హంసతూలికా తల్పాల మీద నివశించిన పిల్ల.... కనీసం ఉండ టానికో యిల్లుకూడాలేని ఆపోకిరి వెధవతో యేం సుఖపడ్తుంది. "

"ఎవ్వరూ ఇవన్నీ ఆలోచించి ప్రేమిం చుకోరు. ప్రేమించుకోవటం అనేది చాలా కాకతాళీయంగా జరిగిపోతుంది. అదొక మహత్తరమైన అనుభవం. కులమూ, మతమూ, ఆస్తి, అంతస్తు వీటన్నిటికే అతీ తమైంది ప్రేమ. వాళ్ళిద్దరికే నా జోహార్లు. మన దేశంలోని యువతీ యువకులం దరూ వీళ్ళలాగే ప్రేమించి పెళ్ళిళ్ళు చేసు కోవటం మొదలెడ్తే ఈ కులాలూ మతాలూ పోతాయి. ఈ ఉన్నవారు, లేనివారు అనే వ్యత్యాసాలు పోతాయి. స్వచ్ఛమైన మానవత్వం తో కూడిన ఎంతో ఆరోగ్య కరమైన సంబంధాలు యేర్పడ్తాయి. యే సంస్కర్తలు, యే తాత్వికులు, యేమత గురువులు, యే మహాత్ములు సాధించలేని మహత్తరమైన మానవతా విలువల్ని ఈ ప్రేమ వివాహాలు సాధిస్తాయి. నన్నడిగితే ప్రేమవివాహాలు చేసుకున్న యువతీయువ కుల క్కూడా ఉద్యోగాల విషయంలో రిజర్వేషన్లు కల్పించాలి. ప్రభుత్వం ప్రేమ వివాహాల్నిలా ప్రోత్సహిస్తే ఎన్నో కులాం తర వివాహాలు, మతాంతర వివాహాలు జరుగుతాయి. జాతీయ సమైక్యత సాధించ బడ్తుంది. వరకట్నాల సమస్య కూడా పరిష్కరించబడ్తుంది. వెస్టరన్ కంట్రీస్‌లో లాగా మనదేశపు యువతీయువకులందరూ ప్రేమ వివాహాలు తప్ప అరేంజ్డ్ మ్యారే జెస్ చేసుకోకూడదు అనే ఒక దృఢమైన నిర్ణయం తీసుకొని దాన్ని ఆచరించగ్గలి నప్పుడే ఈ దేశం బాగుపడ్తుంది. మన సినిమాల్లో లవ్ మ్యారేజెస్ ఎంత సాధారణం అయిపో యాయో వాస్తవ జీవితంలో కూడా అవి అంత సాధారణం అయిపోవాలి. ప్రేమ వివాహాల్ని సినిమాల్లో అంగీకరిస్తున్నప్పుడు వాటిని వాస్తవ జీవితంలో ఎందుకంగీకరిం చరు?"

మేమిలా మాట్లాడుకుంటుండగానే మా పెద్దమ్మాయి పరిగెత్తుకుంటూ మా దగ్గరికొచ్చి

"నాన్నా! నాన్నా! E. E యోగానం దంగారమ్మాయి శ్రావ్య రాత్రి విషం తాగి చనిపోయిందట" అని చెప్పింది.

"ఇంత ఘోరం ఎప్పుడు జరిగిందట?" అన్నాను దిగ్గున లేచి.

"నిన్నరాత్రి హైదరాబాద్‌లో చనిపోతే ఇప్పుడే కార్లో శవాన్ని తీసుకొచ్చారు. శ్రావ్య ఎవరో ముస్లిమ్‌ను పెళ్ళి చేసుకున్నదట- యోగానందంగారి మనుష్యులు హైదరాబా దంతా వెతికి వాళ్ళెక్కడున్నారో తెలుసు కున్నారట. ఆ అబ్బాయిని బాగా కొట్టి ఈ అమ్మాయినిక్కడకు తీసుకురావాలని ప్రయత్నించారట........ ఆ అబ్బాయిని వీళ్ళు పట్టుకొని కొడ్తుండగానే ఈ అమ్మాయి ఈగలమందో దోమలమందో తాగేసిందట. హాస్పటల్‌కు తీసికెళ్ళే లోపలే చనిపోయిం దట పాపం!" గుక్కతిప్పుకోకుండా చెప్ప సాగింది మా అమ్మాయి ఉబికి వస్తున్న కన్నీళ్ళను ఆపుకోవటానికి ప్రయత్నిస్తూ.

—

[redacted]


## 5వ అఖిల భారత తెలుగు ఆధ్యాత్మిక సాధనా శిబిరము

స్థలము : చిన్మయ సాందీపనీ ఆశ్రమం, సిద్ధబారి
హిమాచల్ ప్రదేశ్

ది. 24-9-93 నుండి 2-10-93 వరకు

ఆచార్యులు : పూజ్యశ్రీ ధర్మర్షి ప్రసాద్ చైతన్యులవారు

బోధనాంశములు :

ఈశావాస్య, కేన ఉపనిషత్తులు మరియు
మహత్ సమాధియోగము (MSY) (ప్రాణాయామ శిక్షణ)

వివరములకు, దరఖాస్తు ఫారములకు సంప్రదించండి :

**M.V.G.** కృష్ణారావు
కేంపు సెక్రటరీ, విష్ణు విహార్,
పర్రాజుగారివీధి, భీమవరం - 534 201.
**Phone : 2300**

క్యాంపు రిజిస్ట్రేషను ఆఖరుతేదీ 20-8-93